# ఆసుపత్రి వచ్చే రోగులతో మన ప్రవర్తన మర్యాదగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ఆరోగ్య సమస్యలతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు వారి సహాయకులతో మన సిబ్బంది ప్రవర్తన మర్యాదగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో మంథని ఆసుపత్రి పని తీరు పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మంథని ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ ఆశించిన స్థాయిలో ఉండటం లేదని కలెక్టర్ తెలిపారు.మాతా శిశు ఆసుపత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు పారిశుధ్య నిర్వహణ మెరుగు పర్చాలని లేని పక్షంలో. పారిశుధ్య కాంట్రాక్టర్ చెల్లింపులు నిలిపి వేయడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.ఆసుపత్రి వచ్చే రోగులతో సిబ్బంది మర్యాదగా ప్రవర్తించాలని, ప్రజల తో సిబ్బంది చాలా దురుసుగా మాట్లాడుతున్నట్లు సమాచారం అందుతుందని, పని తీరు మార్చుకొని పక్షంలో వేటు వేయడం జరుగుతుందని అన్నారు. మంథని పట్టణంలో 26 కోట్లతో చేపట్టిన 50 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని, ఆసుపత్రి అవసరమైన భూమి వైద్య శాఖకు బదలాయింపు పనులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు.పెద్దపల్లి పట్టణంలో 100 పడకల ఆసుపత్రి పనులు వర్షా కాలం లోపు ఒక బ్లాక్ పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డి సి హెచ్ ఓ. శ్రీధర్, సంబంధిత అధికారులు.తదితరులు పాల్గొన్నారు.


ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి




# బాలికలు జీవితంలో గొప్ప స్థాయికి చేరుకోవాలి









**ప్రజాపక్షం/గోదావరిఖని :** బాలికా సాధికారత మిషన్2025లో భాగంగా ఎన్‌టిపిసి రామగుండంతెలంగాణ విద్యుత్తు ప్రాజెక్టుల ఆధ్వర్యంలో నెల రోజులపాటు నిర్వహించిన ప్రత్యేక వర్క్‌షాప్‌లో పాల్గొన్న 120 మంది బాలికలు జీవితంలో గొప్పస్థాయికి చేరుకోవాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అకాంక్షించారు. బుధవారం ఎన్‌టిపిసి ఈడీఎం ఆడిటోరియంలో నిర్వహించిన వర్క్‌షాప్ ముగింపు వేడుకల్లో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్‌తోపాటు ఎన్‌టిపిసి రామగుండంతెలంగాణ విద్యుత్తు ప్రాజెక్టుల ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ చందన్ కుమార్ సమంత, దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సమంత, సెంట్రల్ ఎన్‌బిసి సభ్యుడు బాబర్‌సలీంపాషాలు జ్యోతి వెలిగించి ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. వర్క్‌షాప్‌కు సంబంధించి మ్యూజిక్ వీడియోను ప్రదర్శించారు. శిక్షణ పొందిన బాలికలు నృత్య, కరాటే, యోగా ప్రదర్శనలు, ప్రసంగాలు, బేటి బచావోబేటి పఢావో సందేశాలు, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. శిక్షణ పొందిన బాలికల్లో కనిపించిన పురోగతి, పరివర్తన పట్ల ఎన్‌టిపిసి ఈ.డి. చందన్ కుమార్ సమంత సంతోషం వ్యక్తం చేశారు. సమిష్టిగా మిషన్‌ను విజయవంతం చేయడం పట్ల లేడీస్ క్లబ్, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, వాలంటీర్లు, సహాయక సిబ్బందిని దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు రాఖీ సమంత అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత 50 ఏళ్లుగా జిల్లాలోని ఎన్‌టిపిసి సంస్థ నిర్విరామంగా ప్రజలకు అవసరమైన విద్యుత్తు ఉత్పత్తిని విజయవంతంగా చేస్తూ దేశ అభివృద్ధికి బాటలు వేయడం పట్ల కలెక్టర్‌గా తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు. ఎన్‌టిపిసి సంస్థను సమర్థవంతంగా నిర్వహిస్తున్న యాజమాన్యానికి, ఉన్నత అధికారులు, సిబ్బందికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. శిక్షణ పొందిన బాలికల్లో ఆత్మవిశ్వాసం స్పష్టంగా తెలుస్తోందని, ఇట్టి మార్పు సాధ్యం చేసిన ఎన్‌టిపిసి సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. శిక్షణ పొందిన బాలికలు ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. రాబోయే అయిదు, పదేళ్ల కాలంలో వారు గొప్ప స్థాయికి ఎదగాలన్నారు. జీవితంలో తాము నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా లక్ష్యం వైపు కొంత సమయం సాధన చేయాలన్నారు. వర్క్‌షాప్‌ను విజయవంతం చేసిన సిబ్బందిని అభినందించారు. అనేక మంచి పనులు చేస్తున్న ఎన్‌టిపిసి వాటికి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ప్రజలలో ఎన్‌టిపిసి ఏ మి చేయడం లేదనే అభిప్రాయాన్ని తొలగించేందుకు కృషి చేయాలన్నారు. మనం చేసే మంచి పని కూడ ప్రజలకు చేరడం అంతే ముఖ్యమని కలెక్టర్ సూచించారు. శిక్షణ పొందిన బాలికలకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిపిసి అధికారులు బిజోయ్ కుమార్ సిక్దర్, సింగరాయ్, ప్రవీణ్‌చౌదరి, వేముగంటి యుగేంధర్‌రావు, సీఎస్సార్, హెచ్‌ఆర్, సంబంధిత విభాగాల ఉన్నతాధికారులు, అధికారులు, యూనియన్ల, అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కాసులు కురిపిస్తున్న ఇసుక దందా..!!





## పరిమితికి మించి లోడుతో ఇసుక లారీలు
## దెబ్బతింటున్న గ్రామీణ ప్రాంత రహదారులు
## కాంట్రాక్టర్‌కు కోట్లు కురిపిస్తున్న ఇసుక వ్యాపారం
## మామూళ్ల మత్తులో పట్టించుకోని సంబంధిత అధికారులు

**ప్రజాపక్షం/వీణవంక:** ఇసుక దందాపై అధికార యంత్రాంగం ఉక్కుపాదం మోపుతున్నట్లు చెబుతున్నా ఆ దిశగా అడుగులు పడడం లేదు.. సంబంధిత అధికారులు మామూళ్ల మత్తులో పట్టించుకోకపోవడంతో ఇసుక దందా కాంట్రాక్టర్లకు కాసులు కురిపిస్తోంది. అక్రమ ఇసుక రవాణాకు తోడు పరిమితికి మించి అధిక లోడుతో ఇసుక లారీలు నిత్యం వెళ్లడంతో గ్రామీణ ప్రాంత రహదారులు దెబ్బతింటున్నాయి. ప్రమాదాలు జరిగి మరణించిన సంఘటనలూ ఉన్నాయి. ఇదంతా బహిరంగంగా జరుగుతున్నా.. ఫిర్యాదులు అందుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. వారి వ్యవహార శైలితో ఇసుక రవాణా విషయంలో ఆయా గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీణవంక మండలం మీదుగా మానేరునది తీర గ్రామాల నుంచి వందలాది లారీలు ఇసుకను లోడ్ చేసుకుని రవాణా చేస్తున్న సమయంలో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతింటున్నాయి.

పరిమితికి మించి అధిక లోడు మానేరు వాగులో అడ్డగోలుగా నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేని చోట్ల ఇసుక తవ్వకాలు జరిపి లారీలలో పరిమితికి మించి రవాణా చేయడం వల్ల గుత్తేదారులు అనతి కాలంలో కోట్ల రూపాయలను అర్జిస్తున్నారు. మానేరు వెంబడే ఉన్న చల్లూరు, ఇప్పలపల్లి, మల్లారెడ్డిపల్లి, కోర్కల్, కొండపాక, కల్లుపల్లి గ్రామాల నుంచి పగలు రాత్రి తేడా లేకుండా వందల సంఖ్యలో లారీలు టిప్పర్లతో ఇసుక రవాణా జరుగుతోంది. ఒక్కో లారీ టిప్పర్లలో కేవలం 20 నుంచి 25 టన్నుల ఇసుక రవాణా మాత్రమే జరగాల్సి ఉండగా ఒక్కో లారీలో 40 నుంచి 50 టన్నుల ఇసుక లోడ్ చేసి గ్రామీణ రోడ్లపై రవాణా చేస్తున్నారు. ఫలితంగా కరీంనగర్ నుంచి జమ్మికుంట రహదారి పూర్తిగా దెబ్బతిన్నది. ఈ రహదారిని కోట్లాది రూపాయలతో నిర్మించగా పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం పట్ల గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అరచేతిలో ప్రాణాలు

భారీ లోడుతో లారీలు ప్రయాణించడం మూలంగా రోడ్లపై గుంతలు ఏర్పడడంతో రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గ్రామీణ ప్రాంత రహదారుల్లో ఎదురుగా వచ్చే వాహనాలకు సైడ్ ఇవ్వకుండా వస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా నిలిపిన లారీలతో ద్విచ క్ర వాహన దారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. వీణవంక మండలంలోని మామిడాలపల్లి నుంచి వీణవంక మం డల కేంద్రం వరకు నిత్యం లారీలు వందల సంఖ్యలో ఇసుక రవాణా జరుగుతోంది. వాహన దారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేస్తున్నారు. ఈ విషయంలో సంబంధిత ఆర్డీవో కనీసం తనిఖీలు చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎస్సై తోట తిరుపతి వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ ఇసుక దందాను అరికట్టి, అనుమతి ఉన్న చోట అధిక లోడు ఇసుక లారీలను నియంత్రించి సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## తహసీల్దార్ ఎదుట బైండోవర్

ప్రజాపక్షం/కొత్తపల్లి:కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తిని సిఐ నిరంజన్ రెడ్డి తహసీల్దార్ రాజేష్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా కరీంనగర్ రూరల్ సిఐ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ట్రాక్టర్ నందు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన గొల్లపల్లి గ్రామానికి చెందిన బోనగిరి చిరంజీవి డ్రైవర్, ట్రాక్టర్ యజమాని ఎలవేని అనిల్‌లను పోలీసులు తహసీల్దార్ రాజేష్ ఎదుట బైండోవర్ చేశారు. మరోసారి ఎలాంటి చట్ట వ్యతిరేక చర్యలు చేపట్టకుండా తహసీల్దార్ ముందు హాజరు పరిచి లక్ష రూపాయల పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఇకపై ఇసుక అక్రమ రవాణా చేస్తూ దొరికినట్లయితే వ్యక్తులపై ఇంకా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మత్స్యకారుల సంఘం సోషల్ మీడియా అధ్యక్షురాలుకి సన్మానం

ప్రజాపక్షం/గొల్లపల్లి: తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మత్స్యకారుల సంక్షేమ సంఘం ధర్మపురి నియోజకవర్గం,జగిత్యాల జిల్లా సోషల్ మీడియా అధ్యక్షురాలుగా ఎన్నికైన జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన బోయపోతుల వనిత శ్రీశైలం ముదిరాజ్ ను బుధవారం ఎండపల్లి మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కనపట్ల నరసింగం ,గౌరవ అధ్యక్షులు బొమ్మర వేణి రాజేశం ,సంఘ సభ్యులు ఆయా గ్రామాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు ఆహ్వానించి ఘనంగా శాలువాతో సన్మానించారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ,ముదిరాజ్ ల ప్రధాన సమస్య బిసిడి నుండి బిసిఎ లోకి మారితే ముదిరాజ్ కులస్తులు మారితేనే ముదిరాజ్ యువతకు రిజర్వేషన్ల తో పాటు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు వస్తాయని అందుకు మనమందరం కలిసికట్టుగా పోరాటం చేస్తేనేబిసిఎ లోకి మారడం జరుగుతుందని అన్నారు.అనంతరం సన్మానించిన మండల ముదిరాజ్ సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి నది నవరాత్రోత్సవములు

ప్రజాపక్షం / ధర్మపురి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్రంలో ఈ నెల 5 నుండి గోదావరి నది నవరాత్రోత్సవములు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం పక్షాన నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, దేవస్థానం చైర్మన్ జక్కు రవీందర్ తెలిపారు. గోదావరి నది జేష్ట శుద్ధ దశమి రోజున వచ్చినట్లుగా పూర్వీకులు పేర్కొనగా ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో చాలా సంవత్సరాలుగా గోదావరి నదికి నవరాత్రులు జరపడం సాంప్రదాయంగా కొనసాగుతున్నట్లు వారు చెప్పారు. ఈ నెల 5 నుండి తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలలో దేవస్థానం నుండి వేదపండితులు, అర్చకులు, స్థానికులు మేళతాళాలతో గోదావరి నదికి వెళ్లి విశేష పూజలు నిర్వహించి గంగాహారతి ఇవ్వనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా ఈవో శ్రీనివాస్, చైర్మన్ రవీందర్, ధర్మకర్తలు కోరారు.

## రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులకు వెంటనే పరిష్కారం

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి




ప్రజాపక్షం /హుజురాబాద్:జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాలలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై విచారణ జరిపి వెనువెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. బుధవారం హుజురాబాద్ మండలం కనుకులగిద్దె గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన భూభారతి నూతన రెవెన్యూ చట్టం గ్రామ రెవెన్యూ సదస్సుకు జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూభారతి నూతన రెవెన్యూ చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించునుదని అన్నారు. భూ సమస్యలు ఉన్న ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ అధికారులు పక్కాగా రికార్డు నమోదు చేయాలని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన దరఖాస్తులను వెనువెంటనే పరిష్కరించాలని అన్నారు. జూన్ 20వ తేదీ వరకు అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని, భూ సమస్యలున్న ప్రజలు ఈ రెవెన్యూ సదస్సులకు హాజరై దరఖాస్తు సమర్పించాలని సూచించారు. కనుకుల గిద్దె గ్రామానికి చెందిన అర్జీదారుల సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు, అధికారులకు కొన్ని సూచనలు సలహాలు ఇచ్చారు. స్వీకరించిన దరఖాస్తులకు రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సులో హెల్ప్‌డెస్క్, రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు. సమస్యల వారీగా అర్జీలను విభజించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి, తహసీల్దార్ కనకయ్య, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## 24 గంటల్లో దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు..

ప్రజాపక్షం/ వేములవాడ టౌన్: వేములవాడ పట్టణ పోలీసులు 24 గంటల్లో దోపిడీ కేసును ఛేదించి నిందుతులను అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ మాట్లాడుతూ ఈనాయత్ నగర్ గ్రామం కమ్మర్పల్లి మండలం నిజామాబాద్ జిల్లాకు చెందిన బడవత్ తిమ్మి భర్త మనోహర్ అనే మహిళ తేదీ 01.06.2025 రోజున రాత్రి సుమారు 7:30లకు వేములవాడ దైవదర్శనానికి రాగా, తిప్పాపూర్ బస్టాండ్ ముందు ఆటో స్టాండ్ వద్ద ఒక వ్యక్తి నిలబడి ఆమెను మీ బంధువులు గుడి వద్ద ఉన్నారని, తనకు తెలుసని మిమ్ముల్ని గుడి వద్దకు తీసుకు వెళ్తానని మాయమాటలతో నమ్మించి ఆమెను తన ఆటోలో ఎక్కించుకొని వేములవాడలోని చెక్కపల్లి రోడ్డులో గల పెద్దమ్మ టెంపుల్ ప్రాంతానికి తీసుకువెళ్లి, అక్కడ ఎవరు లేని సమయంలో ఆమెను కత్తి తో బెదిరించి ఆమె మెడలో నుండి బంగారు ఆభరణాలైన 3 గ్రాముల పుస్తెలు, 4 గ్రాముల చెవి కమ్మలు, 2 గ్రాముల మాటీలు మరియు ఒక గ్యారెంటెడ్ చైను మరియు పరుసులో ఉన్న నగదు డబ్బులు సుమారు 3000 రూపాయలు ఆమె నుండి దోపిడీ చేసుకొని పారిపోగా, తేదీ 03.06.2025 రోజున బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా తేదీ 04.06.2025 రోజున సంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితుడు అయిన బోదాసు అశోక్(33) ఎల్లంపేట గ్రామం, కామారెడ్డి ప్రస్తుత నివాసం బాలానగర్, వేములవాడ అనునతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా దోపిడి చేసిన బంగారు ఆభరణాలు కొన్ని తన వద్ద ఉంచుకొని మిగతావి తన స్నేహితుడు అయిన బొమ్మిడి గణేష్(25) రేకుర్తి, కొత్తపల్లి మండలం కరీంనగర్ ప్రస్తుత నివాసం జాతర గ్రౌండ్, వేములవాడ వద్ద దాచి పెట్టినానని తెలుపగా ఇద్దరిని బుధవారం రోజు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 3 గ్రాముల పుస్తెలు, 4 గ్రాముల చెవి కమ్మలు, 2 గ్రాముల మాటీలు, ఒక రోల్డ్ గోల్డ్ చైన్, ఒక కత్తి, రెండు సెల్ ఫోన్లు, ఒక ఆటో స్వాధీన పరుచుకొని రిమాండ్ కు తరలించారని తెలిపారు. నిందితుడు అయిన బోదాసు అశోక్ గతంలో కూడా ఇల సురేందర్ (45)ని కూడా నమ్మించి తిప్పాపూర్ బస్ స్టాండ్ వద్ద నుండి ఎటిఎం కు వెళ్ళి వస్తానని అతని బజాజ్ పల్సర్ బండి ని కూడా దొంగిలించినాడు. నిందితులను 24 గంటలలో పట్టుకున్న వేములవాడ ఇన్స్పెక్టర్ , హెడ్ కానిస్టేబుల్ , కానిస్టేబుల్ లను జిల్లా ఎస్‌పిఅభినందించారు.

## బయోమెట్రిక్‌తో ఇబ్బందులు



ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :జాతీయ విపత్తులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మూడునెలల బియ్యాన్ని ఒకేసారి ప్రజలకు అందిస్తోంది.గ్రామాలలో మాత్రం మూడు నెలల రేషన్ ఒకేమారుగా ఇవ్వడంతో పల్లెలలో మాత్రం పరేషన్ మొదలైంది.పీవోఎస్ మిషన్ మొరాయించడంతో ఒక్కొక్కరు ఆరుసార్లు బయోమెట్రిక్ వేయాల్సివస్తోంది.ఒక్కో లబ్ధిదారుడిని కేంద్రప్రభుత్వం ఐదుకిలోలు,రాష్ట్రప్రభుత్వం ఒకకిలో చొప్పున బియ్యం ఇస్తుండటంతో మూడునెలల రేషన్ తీసుకోవడం కోసం ఐదుకిలోలకు మూడు సార్లు,మూడుకిలోలకు మూడుసార్లు వేలుముద్ర సేకరించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది.ఫోన్ ఎంట్రీ చేస్తు తూకం వేసి రేషన్ పంచాలంటే కనీసం ఇరవై నిమిషాల వ్యవధి ఏర్పడుతుంది.గంటల కోలది నిలబడే చౌరదరల దుకాణం ముందు వినియోగదారులు డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సాంకేతిక లోపంతో డీలర్లు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అధికారులు అదునాతన సాంకేతిక యంత్రాంగాన్ని ఉపయోగించాలని కోరుతున్నారు.జూన్ నెలలో ముప్పై తేది వరకు రేషన్ బియ్యాన్ని అందిస్తామని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు.

## ఖనిలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి: లింగా వివక్షత లేని సమాజమే లక్ష్యంగా, మహిళాల హక్కుల కోసం, విముక్తి పోరాటంలో భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) స్థాపించబడిందని సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి కామ్రేడ్ తాండ్ర సదానందం,ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ అసాల రమ లు అన్నారు. బుధవారం స్థానిక భాస్కర్ రావు భవన్ లో భారత జాతీయ మహిళా సమాఖ్య 71వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షురాలు మడికొండ ఓదెమ్మ జెండా ఆవిష్కరణ చేశారు.అనంతరం వక్తలు మాట్లాడుతూ 1954 జూన్ 4వ తేదీన కలకత్తా నగరంలో అరుణ అసపాలి, రేణు చక్రవర్తి, అజారా బేగం, విమల ఫరుఖి, గీతా ముఖర్జీ లాంటి మహిళా ఉద్యమ నేతల సారథ్యంలో మహిళా సమాఖ్య నిర్మాణం చేయబడి స్థాపించబడిందని, మహిళల విముక్తి కొరకు సమానత్వం కొరకు సాధికారిత కొరకు నిరంతరం క్రియాశీల పోరాటాలని కొనసాగిస్తుందని తెలిపారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సనాతన భావాలకు నిరసనగా ఉద్యమించి అనేక విజయాలు సాధించడం జరిగిందన్నారు. బాల్యవివాహాల రద్దు సతి సహగమన రద్దు, వరకట్న నిషేధ చట్టం, విద్యా హక్కు చట్టం, సమాన పనికి సమాన వేతన చట్టం, గృహహింస నిరోధక చట్టం తీసుకురావడంలో అనేక త్యాగాలు చేయడం జరిగిందన్నారు. పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు డీలిమిటేషన్ తో సంబంధం లేకుండా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి కామ్రేడ్ కె కనక రాజ్, సహాయ కార్యదర్శి కామ్రేడ్ తాళ్ళ పెల్లిమల్లయ్య,ఎన్ఎఫ్ఐడబ్ల్యూ నాయకురాళ్లవనపాకల ఓదెమ్మ, దొంత కమలమ్మ,మాధురి, అంజలి,తార,పద్మ, మణెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల సొంతింటి కల నెరవేరుతోంది

ప్రజాపక్షం/వీణవంక:వీణవంక మండలం చల్లూరు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ బాబు బుధవారం ఇండ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం 40 నుంచి 50 మందికి పట్టాలు అందజేయడం జరిగిందన్నారు. నిరుపేదలు సొంతిల్లు కట్టుకోవడంతో వారు కన్న కలలు నెరవేరుతున్నాయన్నారు. అర్హులైన అభ్యర్థులు రెండో విడతలో మంజూరవుతాయని, ఎటువంటి ఆందోళన చెందవద్దని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎక్కేటి రఘుపాల్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు లక్ష్మణ్, మండల ఉపాధ్యక్షుడు ఎండి సోహెల్, ఏలే మధుసూధన్, బూదాస్ కొమురయ్య, సమ్మయ్య, కార్తీక్, తదితరులున్నారు.

## భూభారతి రైతులకు వరం

### కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బాలబద్రి శంకర్

ప్రజాపక్షం/కొత్తపల్లి:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం పేద రైతులు బడుగు బలహీన ప్రజలకు వరంగా మారిందని డివిజన్ అధ్యక్షుడు బాలబద్రి శంకర్ అన్నారు. కొత్తపల్లి మండలంలోని రేకుర్తి గ్రామంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సును సందర్శించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలనలో పది సంవత్సరాలు పేద రైతులు భూయజమానులు ఎదుర్కొన్న సమస్యలపై కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి వల్ల అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. రెవెన్యూ సదస్సులో చాలా మంది రైతులు, భూసమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలు సమస్యలను వివరిస్తూ తహసీల్దార్‌కు దరఖాస్తులు సమర్పించారని, రెవెన్యూ సిబ్బంది సమాధానాలిస్తూ అర్జీలను పరిశీలించి చట్టపరంగా సమస్యలను పరిష్కరిస్తామని తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రేకుర్తిలో దళితుల భూములకు సంబంధించి అనేక సమస్యలు ఉన్నాయని, వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో , రైతులు, ప్రజలు, తదితరులున్నారు.

## నూతన వధూవరులకు నారా లోకేష్ పెళ్లి కానుక

ప్రజాపక్షం/కరీంనగర్:సిరిసిల్ల నియోజకవర్గ టిడిపి ఇంచార్జి ఆవునూరి దయాకర్‌రావు కుమారుడు సోమిత్ కుమార్ వివాహం కీర్తి ప్రతిష్టతో బుధవారం కరీంనగర్ జరిగిన సందర్భంగా టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు, జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి బక్కని నరసింహులు వారి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పంపించిన పెళ్లికానుకను నూతన వధూవరులకు అందజేశారు. కార్యక్రమంలో కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్ వంచే శ్రీనివాస్ రెడ్డి, జహీరాబాద్ పార్లమెంటు కన్వీనర్ , నిజామాబాద్ పార్లమెంటు కన్వీనర్ , రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి దామెర సత్యం, మల్కాజిగిరి పార్లమెంట్ అడహక్ కమటీ సభ్యుడు , పెద్దపల్లి పార్లమెంటు ముఖ్య నాయకులు, రాష్ట్ర ఎస్‌సి సెల్ మాజీ ఉపాధ్యక్షుడు,స్థానికపార్లమెంటు నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## బాధిత కుటుంబానికి ఎల్‌ఒసి చెక్ అందజేత

ప్రజాపక్షం/ముత్తారం :పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన కునూరి నిహాల్ అనే బాలుడు ఛాతి సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. అయితే ఛాతికి సంబంధిత వ్యాధితో బాధపడుతున్న నిహాల్ హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా నిహాల్ తాత అయినా శ్రీనివాస్ గౌడ్ వైద్య ఖర్చుల సహాయం కోసం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దొద్ద బాలాజీని, మాజీ జెడ్పిటిసి చొప్పరి సదానందం సంప్రదించి తన మనుమడి అనారోగ్యం గురించి తెలిపి ఆర్థిక సహాయం అందించాలని కోరగా స్పందించిన వారు మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి ఇక్కడి సమస్యను తీసుకువెళ్లగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ స్పందించి ఒక లక్ష 50 వేల రూపాయల విలువ గల ఎల్ఓసీ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు , కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సదానందం లకు కృతజ్ఞతలు తెలిపి కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటామని అన్నారు.

## పండుగలు ప్రశాంతంగా సంతోషంతో జరుపుకోవాలి

**ప్రజాపక్షం/గోదావరిఖని :** బక్రీద్ పురస్కరించుకొని గోదావరిఖని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. గోదావరిఖని వన్‌టౌన్, టౌటౌన్, రామగుండం సర్కిల్ కార్యాలయాల పరిధిలోని ముస్లిం, హిందూ, క్రిస్టియన్ మత పెద్దలతో పోలీసు అధికారులు శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పెద్దపల్లి డిసిపి కరుణాకర్ మాట్లాడుతూ పండుగలను మతసామరస్యంతో ప్రశాంతంగా సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. పోలీసుల సలహాలు, సూచనలను తప్పకుండా పాటించాలన్నారు. గోదావరిఖని పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలు మతాలకతీతంగా పండుగల సందర్భాల్లో అందరూ కలిసి కుటుంబసభ్యులుగా పాల్గొంటున్నారని ఇదేవిధంగా కొనసాగించాలన్నారు. బక్రీద్ సందర్భంగా పశువుల రవాణాను అనుమతి లేకుండా చేపట్టవద్దన్నారు. వెటర్నరీ డాక్టర్ సర్టిఫికెట్ లేకుండా ఆవులను రవాణా చేయకూడదన్నారు. పశువుల కళేబేరాలను, వ్యర్థాలను బయట పడేయకుండా మున్సిపాలిటి ఏర్పాటు చేసిన డిస్పోజల్ వాహనాలు, కవర్‌లలో మాత్రమే వేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో పశువుల వధ చేసే వారిపై, పశువులను అక్రమ రవాణా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాని, అవసరమైన ప్రదేశాల్లో పోలీసు పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు.
ఈ విషయమై ఏలాంటి సమాచారమైన ముందుగా పోలీసులకు తెలియజేయాలన్నారు. సోషల్ మీడియాలో వదంతులు ప్రచారం చేసి అల్లర్లు, గొడవలు పాల్పడే విధంగా కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, ఇలాంటి వారిపై సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ నిఘా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో గోదావరిఖని ఎసిపి ఎం.రమేష్, సిఐలు ఇంద్రసేనారెడ్డి, ప్రసాద్‌రావు, ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు రమేష్, భూమేష్, ఉదయ్‌కిరణ్, సంధ్యారాణిలు పాల్గొన్నారు.

## రామగుండం బల్దియా ఇక 60 డివిజన్లు!

### ముసాయిదా ప్రకటన విడుదల




**ప్రజాపక్షం/గోదావరిఖని:**తెలంగాణ ప్రభుత్వం 2025లో చేసిన అమెండ్‌మెంటు యాక్ట్ నంబర్ 4 ప్రకారం జీవో నం.14, 25 జనవరి, 2025 ద్వారా రామగుండం నగరపాలక సంస్థను 60 డివిజన్‌లుగా ఏర్పాటు చేస్తూ బుధవారం ముసాయిదా ప్రకటనను విడుదల చేసింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంటు సెక్రటరీ జారీ చేసిన జీవో ఆర్‌టి నం.269, మే 29, 2025 ఆదేశాల మేరకు ఈ 60 డివిజన్లను జనాభా, ఓటర్ల సంఖ్య ఆధారంగా విభజించారు. ఈ మేరకు బుధవారం రామగుండం నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ జె.అరుణశ్రీ ఒక ప్రకటనను విడుదల చేశారు. ముసాయిదా ప్రకటనను కార్యాలయం నోటీసు బోర్డుపై ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముసాయిదాకు సంబంధించి ఆక్షేపణలు, సలహాలు, సూచనలు ఏమైనా ఉంటే ఈనెల 11వ తేదీలోగా కార్యాలయంలో సమర్పించాలన్నారు.

# ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదు

### కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

**ప్రజాపక్షం/భీమ్‌గల్(బాల్కొండ):** ఆ న్‌లైన్‌లో నమోదు చేసేటప్పుడు ధర ఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన త రువాతనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీహనుమంతురెవెన్యూసిబ్బందికిసూచించారు.ఆయన బుధవారం నాడు బాల్కొండ నియోజకవర్గంలోని బాల్కొండ మండలం కిసాన్‌నగర్,నల్లూర్ గ్రా మాలలో కోనసాగుతున్న రెవెన్యూ సదస్సులలో పాల్గోన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ సదస్సుకు హజరైన రైతులతో కలిసి వారితో మాట్లాడారు. వారిభూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అక్కడ జరుగుతన్న సేతలను ఆయనపరిశీలించారు.రిజిస్ట్రేషన్, హెల్ప్‌డెస్క్,ధరఖాస్తుల స్వీకరణ కౌం టర్ల వద్ద ఏర్పాటు చెసిన సదుపాయా లు,సిబ్బంది పనితీరును పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.రెవెన్యూ సదస్సుకు సరిపడా ధరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచాలనిఅన్నారు.రైతులుఒకే ధరఖాస్తులో రెండు,మూడు సమస్యలను పేర్కోనవచ్చని సూచించారు.ఆన్‌లైన్‌లో వివరాల నమోదులో తప్పిదాలకు ఆస్కారం లేకుండా చూడాలని అన్నారు.రైతులకు ఏమైన సందేహాలు ఉంటే అక్కడనే ఉన్న అధికారులను అడిగి సమస్యలను నివృత్తి చేసుకోవాలన్నారు. భూసమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం 18 రాష్టలలో అధ్యయనం జరిపిన తరువాతనే నూతన ఆర్ ఓ ఆర్ చట్టాన్ని ఆమలులోకి తెచ్చిందన్నారు.రెవెన్యూ సదస్సులలో వచ్చిన ధరఖాస్తులను క్షేత్ర స్ధాయిలో పరిశీలించిన తరువాత నిర్ణిత గడువు లోపలనే వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు.భూభారతిలో పొందుపర్చిన మార్గదర్శకాల ప్రకారమే భూసమస్యలను పరిష్కరించేలా సిబ్బందికి మార్గనిర్దేశం చేశామన్నారు.రైతులు రెవెన్యూ సదస్సులను వినియోగించుకోని తమ భూసమస్యలను పరిష్కరించుకోవాలని జిల్లా కలెక్టర రాజీవ్‌గాంధీ హనుమంతు రైతులకు సూచించారు.కలెక్టర్ వెంట ఆర్డీవో రాజాగౌడ్,తాసీల్ధార్ కిరణ్మయి,రెవెన్యూ సిబ్బంది తదితరలు ఉన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేత..



**ప్రజాపక్షం/దిలావర్‌పూర్:**ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం,వ్యవసాయ శాఖ,తెలంగాణ రాష్ట్రం ఆధ్వర్యంలో పంటల సాగులో నాణ్యమైన విత్తనం యొక్క పాత్రను గుర్తించి,జయశంకర్ వ్యవసాయ వర్సిటీ ఈ సంవత్సరం,నాణ్యమైన విత్తనంరైతన్నకు నేస్తం అనే ఒక వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిందని దానిలో భాగంగా బుధవారం రోజు దిలావర్‌పూర్ మండలంలోని బంసపల్లి గ్రామంలో విత్తన పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని దిలావర్పూర్ వ్యవసాయ శాఖ అధికారి రాజేశ్వర్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా శాస్త్రవేత్త రాజ్కుమార్ మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాన్ని రైతులు సాగు చేసి తదుపరి పంట ద్వారా ఉత్పత్తైయెన విత్తనాన్ని తోటి రైతు సోదరులకి తక్కువ ధరకే అందజేయాలని,ఎంపిక చేయబడిన రైతులకు విత్తనోత్పత్తిపై ఎప్పికప్పుడు వ్యవసాయ శాస్త్రవేత్తలు,వ్యవసాయ అధికారుల ద్వారా సలహాలు,సూచనలు ఇవ్వడం ద్వారా రానున్న రెండు మూడు సంవత్సరాలలో ప్రతి గ్రామాన విత్తన స్వయం సమృద్ధి సాధించడమే కాకుండా తెలంగాణ రాష్ట్ర విత్తన భద్రతలో దేశంలోని మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలన్నదే ముఖ్య ఆశయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా వరి,కంది,పెసర పంటల విత్తనాన్ని ఎంపిక చేసిన రైతులకు అందజేయడం జరిగింది.విత్తనాల పంపిణీ కార్యక్రమంలో వెంకటరమణ రెడ్డి,పిఎసిఎస్ చైర్మన్,ఎం.సాయన్న ఏఎంసీ డైరెక్టర్,డాక్టర్ వెంకటరాజ్ కుమార్,శాస్త్రవేత్త కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్,రాజశేఖర్ రెడ్డి,మండల వ్యవసాయ అధికారి దిలావర్పూర్ మండల,ఏఈవో లు రాజేశ్వర్ రెడ్డి,శ్రీవాణి,శ్రావ్య క్లస్టర్ రైతులు పాల్గొన్నారు.

## 9న చలో నిర్మల్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :**ఆదివాసి నాయక పోడు తెగ సమస్యలపై జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేసేందుకు సోమవారం రోజున చలో నిర్మల్ విజయవంతం చేయాలని నాయక పోడు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంక గారి భూమయ్య అన్నారు.బుధవారం రోజున జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించిన సందర్భంగా ఆయన మా ట్లాడుతూ నాయక పోడు తెగ కు సిరియల్ నంబర్ కేటాయించాలని.నిర్మల్ జిల్లాలో 55000 జనాభా ఉన్న గుర్తింపు లేకపోవడం పట్ల సంక్షేమ పథకాలు,విద్య, ఉద్యోగాలు దూరంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని కోరెందుకే చలో నిర్మల్ కార్యక్రమంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.నిర్మల్ జిల్లాలో ప్రదానమైన తెగ నాయక పోడు తెగ అధికారులకు తెలియకపోవడం తాము ఎంత వెనుకబడి ఉన్నామో ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ అర్థం చేసుకోవాలన్నారు.తమ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి,జాతర,సంస్కృతిని సాంప్రదాయా కార్యక్రమాలు చేపట్టాలన్నారు.మా కుల దైవమైన భీమన్న ఆలయాలకు ప్రత్యేక నిధులు కేటాయించి,జాతర ఏర్పాటులకు నిధులు కేటాయించాలన్నారు.ఈ కార్యక్రమాన్ని మన ఆదివాసు బంధువులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జాతీయ ఆదివాసి అభ్యుదయ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్,జిల్లా తుడుందెబ్బ కన్వీనర్ సాకి లక్ష్మ ణ్,జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకుర్ శ్రీనివాస్,జిల్లా ఉపాధ్యక్షుడు అర్జున్ లింగన్న,ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు కస్తూర్ భూమేష్,ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మేడిపల్లి రవి ,కొప్పుల చిన్నయ్య,రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణా రహిత చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

### ఎస్పి జానకి షర్మిల..

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :**జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయం నందు నిర్వహించిన సెట్ కాన్ఫరెన్స్ లో జిల్లా ఎస్పి జానకి షర్మిల పోలీసు అధికారులతో మా ట్లాడుతూ ఖానాపూర్ మండలం లోని పాత ఎల్లపూర్ ఘటన పై ఆరా తీశారు.జిల్లాలో ఇంకెప్పుడు ఇలాంటీ ఘటనలు చోటు చేసుకోకూడదని పోలీసు అధికారులను ఆదేశించారు.ఒకవేళ ఎవరైనా క్రమశిక్షణ రహిత చర్యలకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు.మొదట్నుంటి జిల్లా ఎస్పీ జానకి షర్మిల నిర్మల్ పోలీస్ అంటే మీ పోలీసు అనే ని నాదా న్ని తెర మీదకు తీసుకు వచ్చారు.అంటే పోలీసు అనే వ్యక్తి 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు.అట్లాంటిది ఈ రోజు ఈ ఘటన జరగడం చాలా బాధాకరం అని వ్యక్తపరిచారు.జిల్లాలో పోలీసులు ఎక్కడ కూడా ప్రజలను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేయొద్దని,ప్రజల పట్ల చా చా స్నేహపూర్వకంగా మెలుగుతూ వారి పట్ల ఎంతో వినయంగా ఉంటూ వారి సమస్యలను అడిగి తెల సుకుని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియ జే స్తూ ఉండాలన్నారు.జిల్లాలో ఇంకెప్పుడు కూడా ఇ ట్లాంటి సంఘటనలు పునరావృతం కాకూడదని పో లీ సు అధికారులను హెచ్చరించారు.

## అన్ని గ్రామాలలో 6 నుండి బడిబాట



**ప్రజాపక్షం నందిపేట్ :**నందిపేట్ మండలంలోని అన్ని గ్రామాలలో ఈనెల 6 నుంచి బడిబాట కార్యక్రమం ఉంటుందని మండల విద్యాధికారి అవధూత గంగాధర్ తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల పరిధిలో బడి ఈడు పిల్లలను గ్రామాలలో తిరిగి అధ్యాపక బృందం పాఠశాలలో చేర్పిస్తారని ఆయన చెప్పారు. బడికి వెళ్ళే వయసున్న పిల్లలు ఇంటి పనులు, ఇతర పనులు చేస్తు పాఠశాలకు రావడం లేదని, పిల్లల తల్లిదండ్రులను మెప్పించి పాఠశాలకు వచ్చేలా చూస్తామనిఅన్నారు. గ్రామస్తుల సహకారం తీసుకుంటామని చె ప్పారు.

## సిఎం సహాయనిధి చెక్కు అందజేత

**ప్రజాపక్షం /నందిపేట్ :**నందిపేట్ మండలంలోని తల్వేద, ఉమ్మెడ గ్రామాలలో సిఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ నాయకులు బుధవారం అందజేశారు. ఉమ్మెడ గ్రామానికి చెందిన ఈర్ల నాగన్నకు 26 వేలు, తల్వేద గ్రామానికి చెందిన పద్మ అనారోగ్యంతో చికిత్స చేయించుకుంటే సిఎం సహాయనిది నుంచి 36 వేల చెక్కు కాంగ్రెస్ నాయకులు అందజేశారు.

## జోర్పూర్‌లో సజావుగా సాగిన భూభారతి సదస్సు

**ప్రజాపక్షం/నందిపేట్ :**మంగళవారం నుంచి ప్రారంభమైన భూభారతి రెవెన్యూ సదస్సులు నందిపేట్ మండలంలో సజావుగా సాగుతున్నాయి. భూ యజమానులు, రైతులు పంట భూముల సమస్య గురించి వినతి పత్రాలు అందజేస్తున్నారు. బుధవారం ఖుదావన్‌పూర్, జోర్పూర్ గ్రామాలలో జరిగిన రెవెన్యూ సదస్సులో 108 దరఖాస్తులు వచ్చాయని మండల తహసీల్దార్ సంతోష్ తెలిపారు. రైతులు ఇచ్చే దరఖాస్తులపై త్వరలో విచారణ జరిపి సరైన నిర్ణయం తీసుకొని న్యాయం చేస్తామని చెప్పారు.

## సిఎం సహాయ నిధి నుంచి రూ.2.5లక్షలు మంజూరు

**ప్రజాపక్షం/ఎడపల్లి:**ఎడపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ బురాన్ భార్య తస్లీం బేగం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. గత వారం రోజులుగా ఆమె బ్రెయిన్‌లో నీరు చేరడంతో పరిస్థితి విషమంగా ఉందని, చికిత్సకు సుమారు ఐదు లక్షల రూపాయాలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. పేదరికంలో ఉన్న బురాన్ అంత మొత్తాన్ని భరించలేక నిస్సహాయ స్థితిలో ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎడపల్లి మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు బోధన్ శాసన సభ్యులు, మాజీ మంత్రి పి.సుదర్శన్ రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన సుదర్శన్ రెడ్డి, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి తస్లీం బేగం చికిత్స నిమిత్తం రెండున్నర లక్షల రూపాయాలు మంజూరు చేయించారు. మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి ఆదేశానుసారం ఈఎల్‌ఓసి కాఫీని ఎడపల్లి మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు సయ్యద్ బురాన్‌కు అందచేశారు. ఈ సహాయంతో తస్లీం బేగంకు మెరుగైన చికిత్స అందించి ఆమె త్వరగా కోలుకోవడానికి అవకాశం ఏర్పడింది. సుదర్శన్ రెడ్డి ఉదారతకు, పులి శ్రీనివాస్ రావు చొరవకు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## లంచం డిమాండ్ చేసిన మత్తుమందు డాక్టర్‌ను సస్పెండ్ చేసిన కలెక్టర్

**ప్రజాపక్షం/ముత్తారం/మంథని :** ట్యూబోక్టమి పేషేంట్ వద్ద లంచం డబ్బులు డిమాండ్ చేసిన మత్తుమందు డాక్టర్ మోహన్ రావు ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంథని సామాజిక ఆసుపత్రి లో మత్తుమందు ప్రత్యేక వైద్యునిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మోహన్ రావు రచ్చపల్లి గ్రామానికి చెందిన పేషంట్ కొడాలి భాగ్య నుంచి ట్యూబోక్టమి నిర్వహించేందుకు 5000 రూపాయలు లంచం డిమాండ్ చేస్తూ దొరికిపోయారని, ఆ డాక్టర్ పై పలు ఫిర్యాదులు ఇప్పటికే నమోదైన నేపథ్యంలో సదరు మత్తుమందు డాక్టర్ ను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

**ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ :** రెవెన్యూ సదస్సు ల ద్వారా భూమి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్ అన్నారు. బుధవారం లింగాపూర్ మండలంలోని గమ్నూరు గ్రా మంలో గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆ యన పాల్గొని, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం కింద నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో రైతులు తమ భూ సమస్యలపై దరఖాస్తులు సమర్పిస్తే, క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి త్వరితగతిన పరిష్కారం అందించనున్నట్లు తెలిపారు.

ఈ నెల 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. పేరు సవరణ, విస్తీర్ణ సవరణ, మిస్సింగ్ సర్వే నంబర్లు, నిషేధిత జాబితాలో నమోదైన భూముల సమస్యలపై సమగ్ర దృష్టితో చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సిర్పూర్ యు మండలంలోని భూర్నూర్ (బి) గ్రామం, జైనూర్ మండలంలోని పవార్ గూడ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రహ్లాద్, అడ భీం రావ్, పెద్ది రాజు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# బాల బాలికల రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

## జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య



**ప్రజాపక్షం / మంచిర్యాల :** ప్రస్తుత సమాజంలో నేరగాళ్లు అమాయక బాల బాలికలను, యువతీ యువకులను మోసం చేయడానికి, వివిధ రకాల వేధింపులకు గురి చేయడానికి అనేక మార్గాలను అనుసరిస్తున్నారని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య అన్నారు. హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ ట్రాఫికింగ్ వంటివి వ్యవస్థీకృత నేరాలుగా మారాయని, ఉన్నత స్థాయి నుంచి నిరక్షరాస్యుల వరకు ఎవరైనా వీటి బారిన పడవచ్చని అన్నారు. విద్యార్థులను ఇలాంటి మోసాల నుండి రక్షించడానికి, వారిని చైతన్యవంతులను చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజ్వల ఫౌండేషన్ సహకారంతో రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, అందులో భాగంగా మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలోఈ శిక్షణ కార్యక్రమం రెండవ రోజున ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిఇఒ శిక్షణ ప్రాముఖ్యతను వివరించారు. కెజిబివి, మోడల్ స్కూల్, యుఆర్ఎస్, టిఎస్ఆర్ఐఎస్ పాఠశాలల నుండి ఇద్దరు చొప్పున హాజరవుతున్న ఉపాధ్యాయులు ఈ శిక్షణను చక్కగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జెండర్ అండ్ ఈక్విటీ కోఆర్డినేటర్, కోర్స్ కోఆర్డినేటర్ యశోదర, క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, క్షణ నిర్వాహకులు సిరాజ్, అనిల్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/ మంచిర్యాల టౌన్ :** పట్టణంలోని ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మంచిర్యాల మున్సిపల్ కమిషనర్‌ను బుధవారం బిజెపి నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పట్టణంలోని అనేక వార్డుల్లో డ్రైనేజీలు పూర్తిగా మూసుకుని మురుగునీరు రోడ్లపైకి చేరుతోందని, ప్రజలు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారని, చెత్తకుండీలు లేకపోవడంతో ప్రజలు రహదారులపై చెత్త వేస్తున్నారని, మిషన్ భగీరథ పైపులలో లీకేజీల వల్ల నీరు వృథా అవుతోందని, కాలనీల్లో చెత్తను సకాలంలో తొలగించకపోవడం వల్ల దుర్వాసనతో పాటు అనారోగ్య పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరడంతో పాటు, వీధిదీపాలు పనిచేయకపోవడం వల్ల రాత్రి సమయంలో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, పార్కుల నిర్వహణలో నిర్లక్ష్యంతో అవి అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారుతున్నాయని తెలిపారు. మంచిర్యాల ఎంఎల్‌ఏగా కాంగ్రెస్ అభ్యర్థి గెలిచి 18 నెలలు గడిచినా ఇప్పటికీ పట్టణ సమస్యలపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే బిజెపి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు అమిర్ శెట్టి రాజు కుమార్, పెద్దపల్లి పురుషోత్తం, ఎనగందుల కృష్ణమూర్తి, ఆకుల అశోక్ వర్ధన్, జోగుల శ్రీదేవి, కర్రీ లచ్చన్న, గాజుల ప్రభాకర్, రాజబాబు, నాగుల రాజన్న, రెన్వా రాకేష్, మల్ల అశోక్ రెడ్డి, విజయ్, దేవరకొండ వెంకన్న, దుర్గాప్రసాద్, రవీందర్, శివ, బింగి సత్యనారాయణ, పవన్, కుమారస్వామి, రాజు, అభిలాష్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడులు నిలబడాలి.. చదువుల్లో అంతరాలు పోవాలి




**ప్రజాపక్షం / తాండూర్ :** ప్రభుత్వ బడులు బలోపేతం కావాలని, విద్యావ్యవస్థలో ఆర్థిక అంతరాలు తొలగిపోవాలని తెలంగాణ పౌరస్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఉపాధ్యాయ ఎంఎల్‌సి అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ పౌరస్పందన వేదిక ప్రచార జాతా రెండో విడతలో భాగంగా బుధవారం తాండూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత విద్యా విధానం ధనవంతుల పిల్లలకు ప్రైవేటు విద్యను అందిస్తుండగా, పేదల పిల్లలు ప్రభుత్వ బడులకే పరిమితమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది రాజ్యాంగ ఆశయాలకు విరుద్ధమని, సమాజంలో ఆర్థిక, సామాజిక అంతరాలు తగ్గిపోయి చదువుల్లోనే అంతరాలు సృష్టించగలిగామని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం నియమించిన తెలంగాణ విద్యా కమిషన్ నివేదికను పరిగణనలోకి తీసుకోవాలని, గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలను పునర్వ్యవస్థీకరించాలని, విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. పట్టణాల్లో కొత్త ప్రభుత్వ బడులు ఏర్పాటు చేయాలని, ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు, తగినంత మంది ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యకు 10శాతం కేటాయించి, రాష్ట్రానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని అన్నారు. ధార్మిక సంస్థల ఆధ్వర్యంలోని ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, వాటిని ప్రభుత్వ పాఠశాలలుగానే నిర్వహించాలని సూచించారు. అంతరాలు లేని విద్య కోసం అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పౌరస్పందన వేదిక, టిఎస్‌యూటిఎఫ్, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

# మెడిలైఫ్ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన డిఎంహెచ్‌ఓ హరీష్ రాజ్



**ప్రజాపక్షం / మంచిర్యాల :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్ ఆధ్వర్యంలో వైద్య బృందం, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్‌తో కలిసి మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మెడిలైఫ్ ఆస్పత్రిని ఆకస్మికంగా సందర్శించి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, వైద్యుల వివరాలను బృందం పరిశీలించింది. రోగులతో మాట్లాడి అందించబడుతున్న సేవలు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే, ఆస్పత్రిలో కోవిడ్ సంసిద్ధతను పర్యవేక్షించి, ఐసియు, వెంటిలేటర్లు, ఆక్సిజన్ పడకలను తనిఖీ చేశారు. దేశంలో కోవిడ్ కేసులు పెరుగుతున్నందున, ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేట్ ఆస్పత్రులు కూడా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ ద్వారా అందిస్తున్న సేవలు, ముఖ్యంగా యూరాలజీ, నెఫ్రాలజీ, పాలిక్రమ్ ఫిజీషియన్ సేవలకు సంబంధించి ఆరోగ్య మిత్ర, ఆరోగ్య కోఆర్డినేటర్‌లతో సమీక్షించారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను సందర్శించి వైద్యులు, సిబ్బంది, రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిని శుభ్రంగా ఉంచాలని, అన్ని విభాగాల సిబ్బందికి క్రమం తప్పకుండా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఫైర్ సేఫ్టీ, స్టెబిలైజేషన్, ఇన్ఫెక్షన్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం నమోదు చేసుకున్న అన్ని సూపర్ స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు నిబంధనల మేరకు ఉండాలని, నమోదు కాని ఏ ఆసుపత్రి కూడా పనిచేయరాదని స్పష్టం చేశారు. ప్రతి ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది వివరాలు, అందించే సేవలు, వాటి ఫీజులను బోర్డులపై ప్రదర్శించాలని, రోగుల కోసం స్ట్రెచర్లు, వీల్‌చైర్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాతావరణ మార్పులతో కీటకజనిత వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, డెంగ్యూ పైన ఎలాంటి బయో వందనాలను ప్రచారం చేయరాదని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కుమారస్వామి, రత్న కుమార్, సుమన్, ఎఫ్‌డి.మాలిస్ట్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

# బడి బాట విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం / సిర్పూర్ టి :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలని, బడిబాట కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మండల విద్యాధికారి వేణుగోపాల్ అన్నారు. బుధవారం రోజు సిర్పూర్ టి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపిడిఒ సత్యనారాయణతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో లభించే సౌకర్యాలను గ్రామసభల ద్వారా తల్లిదండ్రులకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలతో కలిసి ర్యాలీలు నిర్వహించి బడిబాట కార్యక్రమంపై అవగాహన కల్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను తెలియజేయాలని, బడి బయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, స్వయం సహాయక బృందాల సభ్యులు ఇంటింటి సందర్శన చేయాలని కోరారు. డ్రాపౌట్ అయిన పిల్లలను గుర్తించి, వారిని తిరిగి పాఠశాలల్లో చేర్చేందుకు ప్రత్యేకంగా చొరవ చూపాలని, ఈ సూచనలు పాటిస్తే బడిబాట కార్యక్రమం విజయవంతమవుతుందని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగి, నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐకెపి దుర్గయ్య, అంగన్వాడీ సూపర్వైజర్లు, ఉపాధ్యాయులు, సిఆర్‌పి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేడు రైతు గుర్తింపు కార్డుల నమోదు ప్రక్రియ

**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :** కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం కొత్తగా రూపొందించిన ఫార్మర్ రిజిస్ట్రీ కార్డు నమోదు ప్రక్రియ కార్యక్రమం గురువారం కాగజ్‌నగర్ మండలంలోని చింతగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని ఎఇఒ సృజన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు నమోదు ప్రక్రియ కార్యక్రమం ప్రారంభం అవుతుందని గ్రామంలోని రైతులందరూ తమ ఆధార్ కార్డులుతో పాటు ఆధార్ కార్డుకు లింక్ ఉన్న సెల్ తీసుకుని రావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# పోలీస్ కళాబృందం ద్వారా అవగాహన కార్యక్రమం



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్ :** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఈస్గాం పోలీస్ స్టేషన్ పరిధిలోని బోడపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మూఢనమ్మకాలు, నూతన చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, సైబర్ మోసాలు, షీ టీమ్స్, గంజాయి నివారణ, సిసి కెమెరాల యొక్క ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ హీరామన్ మాట్లాడుతూ పత్తి విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండి గుర్తింపు పొందిన దుకాణాల వ్యాపారుల నుంచి విత్తనాలు కొనుగోలు చేయాలని అన్నారు. ఎవరైనా విత్తనాలు అమ్మితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా వ్యక్తులు కనపడితే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్న పోలీస్ స్టేషన్‌లో తెలుపాలని లేదా 100 నెంబర్‌కు ఫక్షన్ చేస్తే నిమిషాల్లో పోలీసులు తమ వద్దకు వస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కళాబృందం సభ్యులు రాంచందర్, శ్రీనివాస్, చంద్రశేఖర్, ర జిత, సంఘవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

**ప్రజాపక్షం/ధర్మపురి:**జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని పాలెపు నరహరి కౌసల్య ఏసి ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 8న ఉచిత క్యాన్సర్ రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్ యశోదఆసుపత్రి సౌజన్యంతో శ్రీ అన్నపూర్ణ సేవా సమితి సహకారంతో నిర్వహిస్తున్న ఈ ఉచిత వైద్య శిబిరంలో క్యాన్సర్ వైద్య నిపుణులు డా. శ్రీహరి గౌడ టీం 200 మందికి ఉచితంగా క్యాన్సర్ స్క్రినింగ్ పరీక్షలు చేస్తారని తెలిపారు. ప్రాణాంతక వ్యాధి క్యాన్సర్‌ను ప్రారంభంలోనే గుర్తిస్తే రోగికి స్వస్థత చేకూర్చవచ్చని నిర్వాహకులు పాలెపు గణేష్ తెలిపారు. మరిన్ని వివరాలకు అన్నపూర్ణ సేవా సమితి సభ్యులు పెద్దంబట్ల పెద్ద నరేందర్ (8106614115), పాలెపు గణేష్ (9948982577), పాత రవి శంకర్ (94 41 728351), కాసర్ల వెంకటరమణ (944 074 8443) లను సంప్రదించాల్సిందిగా కోరారు.

# గోపగోని బసవయ్య గౌడ్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/శంకరపట్నం:**శంకరపట్నం మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్ జన్మదిన వేడుకలను బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా టిపిసిసి సభ్యుడు, మాజీ జెడ్‌పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్ హాజరై జన్మదిన శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. హుజురాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిరుపతి గౌడ్, కాంగ్రెస్ నాయకులు మల్లారెడ్డి, బండారి తిరుపతి, మధు, ప్రవీణ్, మండల కాంగ్రెస్ నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
వార్తకు ఫోటో ఉంది

# రెవెన్యూ సదస్సులను సద్వినియోగం

## తహసీల్దార్లు ఆర్‌వి లక్ష్మి , రాజేష్



**ప్రజాపక్షం/కొత్తపల్లి:**ప్రజలు రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకుని భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవాలని కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ తహసీల్దార్లు ఆర్‌వి లక్ష్మి, రాజేష్‌లు అన్నారు. కొత్తపల్లి మండలం రేకుర్తి, కరీంనగర్ రూరల్ మండలంలోని జూబ్లీనగర్ గ్రామాల్లో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సంధర్బంగా గ్రామస్తులు తమ భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి కార్యక్రమం ద్వారా సంవత్సరాల తరబడి నెలకొన్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ప్రభుత్వం సూచించిన నిర్దేశాల మేరకు ధరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు కనుక రాజు, వాస్తవిక్, రజనీకాంత్, రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.

# మాలల విద్య, వైద్యం, ఎంపవర్మెంట్‌పై అవగహనా సదస్సు



**ప్రజాపక్షం/ముత్తారం/మంథని :** భీమ్ వార్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జ్ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నీరుడి ప్రశాంత్ ఆధ్వర్యంలో మాలల విద్య, వైద్యం,ఎంపవర్మెంట్ ఆర్థిక స్థితిగతుల అవగహన సదస్సులో భాగంగా గత 10 రోజల నుండి వివిధ జిల్లా పర్యటన చేస్తూ బుధవారం పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని ఎక్లాస్ పూర్ గ్రామంలో మాల యువకులతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా యువకులను ఉద్దేశిస్తూ మాలలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని దానికి సంబందించిన అవగాహన, చైతన్యం పెంపొందించుకోవాలని తెలియజేయడం జరిగింది. మాల యువతి,యువకులకు రాజ్యాంగ బద్దంగా సంక్రమించే అన్ని విషయాల్లో భీమ్ వార్ సంఘం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలియజేయడం జరిగింది.మాలల విద్య, వైద్యం, ఎంపవర్మెంట్ కోసం భీమ్ వార్ సంఘం ముందుండి పోరాటం చేస్తుందని హామీ ఇవ్వడం జరిగింది. గ్రామ గ్రామన ప్రతి ఒక్క మాల యువతి, యువకులు ఇదే పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరాడం జరిగింది.ఈ కార్యక్రమంలో భీమ్ వార్ రాష్ట్ర ఇంచార్జ్ ఆర్ల జ్ఞాని, పెద్దపల్లి జిల్లా ఇంచార్జ్ జంజర్ల సుదర్శన్,ఎక్లాస్ పూర్ గ్రామానికి సంబందించిన మాల కుల సంఘం,మాల అఖిల పక్షం నాయకులు ఆర్ల నారాయణ,జంజర్ల శేఖర్, జంజర్ల రమేష్,రాధారపు నితీష్, జంజర్ల శైలందర్,ఆర్ల విఖిల్, పసరగొండ నరేష్, తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల రక్షణకు కృషి

## ఎస్ఐ జిల్లెల్ల రమేష్



**ప్రజాపక్షం / చందుర్తి :** మండలం లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్ఐ జిల్లెల్ల రమేష్ అన్నారు.ఇక్కడ ఎస్ఐ గా విధులు నిర్వహిస్తున్న అంజయ్య వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ కి బదిలి పై వెళ్ళగా వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న జిల్లెల్ల రమేష్ చందుర్తి ఎస్ఐ గా బుధవారం భాద్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇక్కడ పని చేసిన అనుభవం తో మండలం లో అసాంఘీక కార్యకలాపాలు జరుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరించిన , ఎలాంటి అసాంఘీక కార్యకలాపాలు చోటుచేసుకున్న ప్రజలు పోలీసులకు సమాచారం అందివ్వాలని కోరారు.ముఖ్యంగా యువత మద్యం , గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ భవిష్యత్తు పై దృష్టి సారించాలని సూచించారు .పోలీస్ స్టేషన్ పరిధి లో నిత్యం డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు , వాహన తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడపడం , సరైన పత్రాలు లేకపోవడం , హెల్మెట్ ధరించకపోవడం , మండలం లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం లాంటి చర్యలకు పూనుకుంటే వారిపై కఠినంగా వ్యవహరించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# గ్రామీణ వైద్య సేవలు అభినందనీయం

## మాజీ జెడ్‌పి ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్



**ప్రజాపక్షం/చిగురుమామిడి:**చిగురుమామిడి మండల కేంద్రంలో శ్రీనివాస విజన్ సెంటర్, శరత్ మాక్సీ విజన్ ఆద్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని మాజీ జడ్పిటిసి రవీందర్ బుధవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్నారు. శ్రీనివాస విజన్ సెంటర్ నిర్వాహకులు ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి మూడు వేలకు పైగా ప్రజలకు ఉచిత కంటి ఆపరేషన్లు చేయించారన్నారు. ఈ శిబిరంలో 230 మందికి బిపి, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి 48 మందికి కంటి శుక్లాలు ఉన్నాయని గుర్తించి వారికి కంటి అద్దాలు, చుక్కల మందులు పంపిణీ చేశారు. ఆపరేషన్ అవసరమైన వారికి కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రి, అవసరమైతే హైదరాబాద్ నగరానికి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తారని చెప్పారు. పేషెంట్లకు ఉచిత రవాణా, భోజన వసతి సైతం కల్పిస్తారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న శ్రీనివాస విజన్ సెంటర్ నిర్వాహకులు తిప్పారపు శ్రీకాంత్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో తిప్పారపు అంజలి, బుర్ర శ్రీనివాస్, సర్వర్ పాషా, చెంచల రవితో పాటు శరత్ మాక్స్ విజన్ సిబ్బంది, తదితరులున్నారు.

# రేకొండ ఎల్లమ్మ తల్లి ఆలయంలో చోరీ

## ఆలయాన్ని పరిశీలించిన పోలీసులు



**ప్రజాపక్షం/చిగురుమామిడి:**జనసంచారం లేని గ్రామ శివారులో ఉన్న ఆలయాలను, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను టార్గెట్ చేస్తూ చిల్లర దొంగలు రెచ్చిపోతున్నారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండ గ్రామశివారులో గల శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో గుర్తు తెలియని దొంగలు మంగళవారం అర్ధరాత్రి ఆలయంలోకి చొరబడి ఆలయంలో దాదాపు 6 సంవత్సరాలుగా అమ్మవారిపై ఉంటున్న 25 తులాల వెండి, సంవత్సర కాలంగా హుండీలో భక్తులు వేసిన కానుకలు దాదాపు రూ.20 వేలతో పాటు అర్ధతులం బంగారు బొట్టు బిల్లలను ఎత్తుకెళ్లినట్లు గౌడ సంఘం నాయకులు తెలిపారు. దొంగతనం జరిగిన తీరును గమనించి గౌడ సంఘం అధ్యక్షుడు పాకాల రమేష్ గౌడ్ వెంటనే చిగురుమామిడి పోలీసులకు సమాచారం అందించారు. ఆలయానికి చేరుకున్న పోలీసులు పలు కోణాల్లో విచారణ చేపట్టారు. ఆలయం వద్ద సిసి కెమెరాలు లేకపోవడంతో ఇదే అదునుగా భావించిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ పొలాల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్ చేసి అందులో ఉన్న కాపర్ వైరును చోరీ చేసి లక్షలాది రూపాయల నష్టం చేస్తున్నారు. చోరీకి పాల్పడిన దొంగలను పట్టుకుని తమకు న్యాయం చేయాలని గౌడ సంఘం అధ్యక్షుడు పాకాల రమేష్ గౌడ్, గోపగోని సత్యనారాయణ, గోపగోని సంపత్, పడాల శ్రీనివాస్ గౌడ్, ఏరుకొండ కుమార్, పరకాల కొండయ్య, గ్రామ ప్రజలు తదితరులు పోలీసులను కోరారు.

# ప్రథమ వర్ధంతిలో మాజీ జెడ్‌పిటిసి

**ప్రజాపక్షం/ముంత్తారం:** ముత్తారం మండలంలోని కేషనపల్లి గ్రామానికి చెందిన చుంచు రాజమ్మ గతంలో మరణించగా మృతురాలి ప్రథమ వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించగా ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పిటిసి చోప్పరి సదానందం పాల్గొని మృతురాలి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బక్కతట్ల వినీత్ గ్రామ శాఖ అధ్యక్షుడు పెగడ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కశిఒజ్జుల శ్రీనివాస్,పాశం మొగిలి, కల్వచర్ల మల్లయ్య, ఘనవేన భూమయ్య, బుర్ర కృష్ణ,సుంచు సురేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# రూరల్ ఎస్ఐగా అంజయ్య బాధ్యతలు స్వీకరణ

**ప్రజా పక్షం/ వేములవాడ:** వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్ లో నూతన ఎస్ఐగా అంజయ్య బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ లో జరిగిన సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మండలంలోని శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎటువంటి శాంతి భద్రతలకు భంగం జరగకుండా పోలీస్ వ్యవస్థ ప్రజలతో సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ నేరాల నివారణలో భాగస్వాములు కావాలి, అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొని నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు. కొందరు ఎస్ఐఅంజయ్యకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. అంతేగాక, మండలంలో శాంతి, భద్రతలను మరింత బలోపేతం చేయడం కోసం స్థానికంగాప్రత్యేకచర్యలుచేపడతామని ఎస్ఐఅంజయ్య తెలిపా రు.

# అరకండ్ల, ధర్మారం గ్రామాలలో రెవెన్యూ సదస్సు

**ప్రజాపక్షం/శంకరపట్నం:**మండల పరిధిలోని అరకండ్ల, ధర్మారం గ్రామాలలో బుధవారం భూ సమస్యలపై రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ రెవెన్యూ సదస్సుకు ఆరకండ్ల గ్రామంలో 28 ధరఖాస్తులు, ధర్మారం గ్రామంలో 34 ధరఖాస్తులు వివిధ భూ సమస్యలపై స్వీకరించడం జరిగిందని అధికారులు తెలిపారు. తహసీల్దార్,డిప్యూటీతహసీల్దార్,ఆర్ఐలు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆయన అక్రమ దందాకు అడ్డు చెబితే బెదిరింపులే

**ప్రజాపక్షం/మల్లాపూర్:** కోరుట్ల నియోజకవర్గంలో అక్రమ మట్టి దంధాను అరికట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేశారు. కానీ మండలంలోని అదే పార్టీకి చెందిన ఓ మాజీ వైస్ ఎంపిపి అధికార పార్టీ నేతలతో కుమ్మక్కై ఏకంగా ప్రొక్లైన్ల సహాయంతో భారీగా టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. గ్రామాలతో పాటు పట్టణాలకు రాత్రి పగలు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న అధికారులు చుట్టపు చూపుగా చూసి వదిలేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేనే ఏకంగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన అధికారులలో మాత్రం చలనం లేకుండా పోయింది. అక్రమ మట్టి దందాను అరికట్టాలంటూ ఎవరైనా ప్రయత్నిస్తే సదరు నాయకుడు తన పలుకుబడిని ఉపయోగించి బెదిరింపులకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి మట్టి దందాను అడ్డుకోవాలని ప్రజ లు కోరుతున్నారు.

# గాయత్రి బ్యాంక్ ద్వారా రూ. లక్ష చెక్కు అందజేత



**ప్రజాపక్షం/ధర్మపురి:**జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని గాయ త్రి బ్యాంక్‌లో ఖాతాదారుడిగా ఉండి ప్రమాదవశాత్తు మృతి చెంద గా మృతుడి భార్యకు రూ.లు ఒక లక్ష ప్రమాద భీమా అందజేశారు. మండలంలోని రాయపట్నం గ్రామానికి చెందిన గటిక చిన్నయ్య 2022 ఆగస్టు 22న విద్యుత్ ప్రమాదంలో మృతి చెందాడు. గాయత్రి బ్యాంక్‌లో నిర్భయ సేవింగ్ ఖాతాదారుడైన మృతుడు చిన్నయ్యకు ఖాతాపై ఉన్న లక్ష రూపాయల భీమా చెక్కును పట్టణంలోని బ్యాంక్ కార్యాలయంలో బుధవారం మృతుని భార్య అమ్మాయికి బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బింగె తిరుపతి, బ్రాంచ్ మేనేజర్ వొజ్జల మోహన్‌లు అందజేశారు.